సాక్షి
కామారెడ్డి
శనివారం । 7 । అక్టోబర్ । 2023



తండాల అభివృద్ధికి కృషి

నియోజకవర్గంలోని తండాల అభివృద్ధికి కృషి చేస్తున్నానని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



గురుకులాలకు పెద్దపీట

ముఖ్యమంత్రి కేసీఆర్ గురుకులాలకు పెద్దపీట వేస్తున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /18.3

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కామారెడ్డికి మరో కోర్టు

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జిల్లాకు మరో కోర్టును మంజూరు చేసింది. జిల్లా కేంద్రంలో సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కం సెకండ్ అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'కేసీఆర్‌ను నమ్మొద్దు'




మాచారెడ్డి: సీఎం కేసీఆర్ మాట్లాడే పిట్టల దొర మాటలు నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ప్రజలను కోరారు. భవానీపేటలో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు షబ్బీర్ అలీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాల ప్రభుత్వ భూములను గుంజుకోవడానికే కేసీఆర్ వస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అంటేనే బందిపోట్లు, రౌడీల సమూహం అని ఎద్దేవా చేశారు. గంప గోవర్దన్, ఆయన దోపిడీ ముఠా రంగు ప్రజలకు తెలిసిపోయిందని, అందుకే కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేయడానికి వస్తున్నాడని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఏఐసీసీ కార్యదర్శి విష్ణునాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, నాయకులు గణేశ్‌నాయక్, రమేశ్‌గౌడ్, నాసీలాల్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్, సల్మాన్ పాల్గొన్నారు.

'వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు'

మద్నూర్: రోగులకు సేవలందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో జనం ప్రభుత్వ ఆస్పత్రికి వస్తున్నారన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి మందులు అందించాలన్నారు. వైద్యులు స్థానికంగా ఉండాలని, రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని, వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు.

శతాధిక ఓటర్లు



- జిల్లాలో 120 ఏళ్లు దాటినవారు 251 మంది
- ఓటరు తుది జాబితాలో పలు ఆసక్తికర అంశాలు

నూరేళ్లు పిల్లాపాపలతో కలిసి సుఖ సంతోషాలతో జీవించు అంటూ పెద్దవాళ్లు ఆశీర్వదిస్తుంటారు. అయితే వందేళ్లు దాటి జీవించిన వాళ్లు చాలా తక్కువగా కనిపిస్తారు. జిల్లాలో శతాధిక వృద్ధులు 312 మంది ఉన్నారు. ఇందులోనూ 120 ఏళ్లు దాటినవారే 251 మంది ఉండడం గమనార్హం.

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఈనెల 4న తుది ఓటరు జాబితాను వెలువరించింది. అందులో పలు ఆసక్తికర అంశాలున్నాయి. జిల్లా ఎన్నికల సంఘం పరిధిలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 6,61,163 మంది ఉండగా.. పురుషులు 3,21,104 మంది, స్త్రీలు 3,40,022 మంది, ఇతరులు 37 మంది ఓటర్లుగా నమోదయ్యారు.

యువ ఓటర్లలో యువతుల సంఖ్య తక్కువే...

జిల్లా ఓటర్లలో పురుషుల కన్నా మహిళా ఓటర్ల సంఖ్య 18,918 మంది ఎక్కువగా ఉన్నారు. అయితే రెండు మూడు దశాబ్దాలుగా ఆడపిల్లలపై పెరిగిన వివక్షతో గర్భంలోనే చిదిమేస్తుండడంతో ఆడపిల్లల సంఖ్య తగ్గుతోంది. దాని ప్రభావం ప్రస్తుతం కనిపిస్తోంది. 18 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు ఉన్న నవ ఓటర్లు మూడు నియోజకవర్గాల్లో కలిపి 20,380 మంది ఉండగా.. ఇందులో మగవారు 12,039 మంది, ఆడవారు 8,339 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. అంటే ఓటర్లలో యువకులకన్నా 3,700 మంది యువతులు తక్కువగా ఉన్నారు. అలాగే 20 నుంచి 29 ఏళ్లలోపు ఓటర్లలో కూడా ఆడవాళ్లు తక్కువగా కనిపిస్తున్నారు. 71,353 మంది పురుష ఓటర్లు ఉంటే..66,090 మంది మహిళా ఓటర్లు, 20 మంది ఇతరులు ఉన్నారు. అంటే మగవారికన్నా ఆడవారు 5,263 మంది తక్కువగా ఉండడం గమనార్హం. 30 ఏళ్లు పైబడిన జాబితాలో మాత్రం మహిళా ఓటర్లే ఎక్కువగా నమోదయ్యారు.

వందేళ్లు దాటినవారు..

జిల్లాలో 100 ఏళ్లు దాటినవారిలో 312 మందికి ఓటు హక్కు ఉంది. 100 నుంచి 109 ఏళ్ల మధ్య వయసువారిలో 61 మంది ఓటర్లున్నారు. ఇందులో 19 మంది మగవారు, 42 మంది స్త్రీలు.. 110 నుంచి 119 ఏళ్ల మధ్యలో ఒక్క ఓటరూ లేరు. 120 ఏళ్లు దాటినవారు జిల్లాలో 251 మంది ఓటర్లుగా ఉన్నారు. ఇందులో 115 మంది పురుషులు, 135 మంది స్త్రీలు కాగా ఒకరు ట్రాన్స్‌జెండర్.. 120 ఏళ్లు దాటినవారిలో కామారెడ్డి నియోజకవర్గంలోనే 234 మంది ఉన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 16 మంది, జుక్కల్ నియోజక వర్గంలో ఒకరు ఉన్నారు.

వయసులవారీగా ఓటర్ల వివరాలు

ఓటర్ల వయసు గ్రూప్	ఓటర్ల సంఖ్య
18-19	20,380
20-29	1,37,463
30-39	1,85,553
40-49	1,22,682
50-59	96,330
60-69	13,394
70-79	30,879
80-89	7,559
90-99	1,219
100-109	61
110-119	00
120 ఏళ్లు పైబడినవారు	251

బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి వివిధ విభాగాలకు నియమించిన నోడల్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. నోడల్ అధికారులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలు పరిచే ఫ్లయింగ్ స్క్వాడ్, సర్వైవల్, స్టాటిస్టికల్, వీడియో సర్వైవల్, వీడియో వీవింగ్ బృందాలకు శుక్రవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని నిర్ణీత నమూనాలో ఉన్నతాధికారులకు సమర్పించాలని సూచించారు. ఏ ఒక్కరూ నిబంధనలను అతిక్రమించకుండా చూడాలన్నారు. అభ్యర్థుల ఖర్చులు, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్వాధీనం చేసుకునే నగదు, మద్యం, మత్తు పదార్థాలు, ఉచిత కానుకల వంటి వాటిపై కేసులు నమోదు చేసి కచ్చితమైన డాక్యుమెంటేషన్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్లు మనుచౌదరి, చంద్రమోహన్, ఆర్‌డీవోలు, నోడల్ అధికారులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నెలాఖరులో పత్తి కొనుగోలు కేంద్రాలు

కామారెడ్డి క్రైం: సీసీఐ ఆధ్వర్యంలో ఈనెలాఖరులో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వచ్చే అవకాశముందన్నారు. పంట విక్రయించాలనుకునే రైతులు ముందుగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. జుక్కల్, మద్నూర్, పిట్లం, బిచ్కుంద, గాంధారి, సదాశివనగర్ ప్రాంతాలలో పత్తి దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో రైతుల వివరాల నమోదుకు మీసేవ శిబిరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మద్నూర్ మార్కెట్ కమిటీ పరిధిలో 7 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తేమ 8 శాతానికి మించకుండా పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య, డీఎస్పీ మదన్‌లాల్, డీఏవో భాగ్యలక్ష్మి, డీటీవో వాణి, డీపీవో శ్రీనివాస్, లీగల్ మెట్రాలజీ అధికారి విజయ్, అగ్నిమాపక అధికారి లక్ష్మణ్, అధికారులు, జిన్నింగ్ మిల్లుల ట్రేడర్లు, హమాలీలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందాలి



కామారెడ్డి క్రైం: స్వయం ఉపాధి పొందడం ద్వారా ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక పునరావాసం పథకం కింద యషిక, రష్మిక, పెరిసిస్ అనే ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు రూ.50 వేల చొప్పున మంజూరైన చెక్కులను శుక్రవారం తన చాంబర్‌లో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంతో ఏదైనా వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో బావయ్య తదితరులు పాల్గొన్నారు.

'గ్రామీణ విద్యార్థులకు వరం'



విద్యార్థులతో కలిసి అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

పిట్లం: ముఖ్యమంత్రి అల్పాహార పథకం గ్రామీణ విద్యార్థులకు వరమని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బోయివాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అల్పాహార పథకాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేష్ వి పాటిల్‌లతో కలిసి ప్రారంభించి, విద్యార్థులతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం అల్పాహారాన్ని తీసుకోకుండా పాఠశాలలకు వచ్చిన విద్యార్థులు ఆకలితో అల్లాడుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం.. ఈ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా నియోజకవర్గానికి ఒక పాఠశాలలో ఈ పథకాన్ని ప్రారంభించామన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంఈవో దేవిసింగ్, హెచ్‌ఎం నారాయణ, నాయకులు రమేశ్, విజయ్, ప్రతాప్ రెడ్డి, నర్సాగౌడ్, జగదీశ్, నవీన్ పాల్గొన్నారు.

'ఆడపడుచులకు కానుకగా బతుకమ్మ చీరలు'



బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

నిజాంసాగర్: తెలంగాణ ఆడపడుచులకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను కానుకగా ఇస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పేర్కొన్నారు. శుక్రవారం మహమ్మద్‌నగర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, బీఆర్‌ఎస్ నాయకులు చింతకింది కాశయ్య, విజయ్‌కుమార్, ఇఫ్తకార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వంలో అద్భుత ప్రగతి

- దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా ఎదిగాం
- బిచ్కుంద సభలో మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, ఎంపీ పాటిల్, ఎమ్మెల్యే సింధే

సాక్షి, కామారెడ్డి/నిజాంసాగర్/బిచ్కుంద: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించడం ద్వారా దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం బిచ్కుందలో రూ. 26 కోట్లతో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేశామన్నారు. ఒకప్పుడు నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అనేవారని, ఇప్పుడు 76.8 శాతం కాన్పులు ప్రభుత్వాస్పత్రుల లోనే జరుగుతున్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో మన పిల్లలు ఉచితంగా మెడిసిన్ చదువుకునే అవకాశం ఏర్పడిందన్నారు. ఏటా పది వేల మంది డాక్టర్లను తయారు చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కీర్తిని సాధించనుందన్నారు. జుక్కల్ నియోజకవర్గం హన్మంత్ సింధే ఆధ్వర్యంలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీ బీబీ పాటిల్ కృషి వల్ల అద్భుతమైన జాతీయ రహదారి నిర్మాణం జరిగి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు పడ్డాయన్నారు. కేంద్రం మోటార్లకు మీటర్లు పెట్టమని ఇబ్బంది పెట్టిందని, రూ.35 వేల కోట్లు రాకుండా అడ్డుపడిందని, అయినా సీఎం కేసీఆర్ ఎక్కడా తగ్గలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో కూడా ఉచిత కరంటు అని ఉత్త కరంటు ఇచ్చారన్నారు. పొరపాటున కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే కరంటు మూడు గంటలకు పడిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు ఇకపై ఉదయం అల్పాహారం ఇవ్వాలని సీఎం నిర్ణయించారని, ఈ పథకం కూడా శుక్రవారం ప్రారంభించుకున్నామని తెలిపారు. అదే డబుల్ ఇంజన్ సర్కార్లు ఉన్న దగ్గర గొడ్డు కారం, దొడ్డన్నం పెడుతున్నారని విమర్శించారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ వాళ్లకు భారీగా డబ్బుల సంచులు వస్తున్నాయని, అక్కడి ప్రజల నుంచి తెలంగాణ ట్యాక్స్ వసూలు చేసి ఓట్లు కొనడానికి పంపుతున్నారని ఆరోపించారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ నాయకులు ఫేక్ సర్వే రిపోర్టులు పెడుతున్నారని, వాటిని చూసి ఆగం కావద్దని కోరారు. 2018 లో ఇట్లనే అధికారంలోకి వస్తున్నమని ముఖ్యమంత్రి, మంత్రులమని జబ్బలు చరుచుకున్నారని, కానీ ప్రజలు మనకు 88 సీట్లలో విజయం అందించారని తెలిపారు. తనతో కలిసి ఉద్యమంలో పాల్గొన్న వారి పేర్లను హరీశ్‌రావు తన ప్రసంగంలో ప్రస్తావించారు. హరీశ్‌రావు ప్రసంగిస్తున్నప్పుడు బీఆర్‌ఎస్ శ్రేణులు చప్పట్లు, ఈలలతో హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్న తెలంగాణ.. జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు సాధించిందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు దక్కని అవార్డులు మన రాష్ట్రానికి వచ్చాయన్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన జుక్కల్‌లో దళితులందరికీ దళితబంధు ఇవ్వాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే కోరారు. గృహలక్ష్మి పథకం కింద అదనంగా మరో మూడు వేల ఇళ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు, కౌలాస్‌కోట, సలాబత్‌పూర్, రామలింగేశ్వర ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడానికి నిధులివ్వాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ శోభ, ఎంపీపీలు అశోక్, నీలు పటేల్, బొల్లి గంగాధర్, నాయకులు దఫేదార్ రాజు, తానాజీరావ్, నాల్చర్ రాజు, నాగ్‌నాథ్ పటేల్, అన్నారం వెంకట్‌రాంరెడ్డి, రాజు పటేల్ తదితరులు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టు



బిచ్కుంద: మంత్రి హరీశ్‌రావును అడ్డుకోవడానికి కాంగ్రెస్ నాయకులు మండలకేంద్రంలోని అయ్యప్ప మందిరం వద్ద యత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. అరెస్టైనవారిలో నాయకులు భాస్కర్‌రెడ్డి, మసూద్ తదితరులున్నారు.

రామన్నా... ఇటు సూడన్నా!

- విస్తరణకు నోచుకోని రోడ్లు, జంక్షన్లు
- జిల్లాకేంద్రంలో ఆహ్లాదం కరువు
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- రూ.వందల కోట్లు వెచ్చించినా మారని పట్టణ రూపురేఖలు
- నేడు కామారెడ్డికి మంత్రి కేటీఆర్ రాక

సాక్షి, కామారెడ్డి: జిల్లా కేంద్రంగా ఎదిగినా కామారెడ్డి పట్టణ రూపురేఖలు మాత్రం మారడంలేదు. ఎక్కడి సమస్యలు అక్కడే ఉండి, వెక్కిరిస్తున్నాయి. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పట్టణ అభివృద్ధికి రూ.వందల కోట్లు మంజూరు చేసినా ప్రధాన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. నాలాలు కబ్జాలకు గురవడంతో మురికి నీరు వెళ్లడానికి మార్గాలు లేకుండాపోయాయి. సిరిసిల్ల రోడ్డువైపు వర్షం కురిస్తే చాలు డ్రెయినేజీలు పొంగి మురికి నీరంతా రోడ్ల మీదకు, ఆపై ఇళ్లల్లోకి వచ్చి చేరుతోంది. స్టేషన్ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థే లేకపోవడంతో వర్షం నీరు రోడ్డు మీదే నిలిచిపోతోంది. మురికి నీటిని ట్యాంకర్లలోకి ఎక్కించి తొలగించాల్సిన పరిస్థితి ఉంది. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తే డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇరుకుగా రోడ్లు..

పాత పట్టణంలోని ప్రధాన రోడ్లు విస్తరణకు నోచుకోవడంలేదు. జంక్షన్ల అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. పట్టణం మీదుగా వెళ్లే పాత ఎన్‌హెచ్–7 రహదారి ఒక్కటే విశాలంగా ఉంది. ఇటీవల నిజాంసాగర్ చౌరస్తా నుంచి దేవునిపల్లి మీదుగా లింగాపూర్ వరకు రోడ్ల అభివృద్ధి జరిగినా.. ఇక్కడా డ్రెయినేజీ సమస్య ఉంది.

విస్తరణకు నోచుకోక..

పట్టణంలో ప్రధానమైన సిరిసిల్ల, స్టేషన్ రోడ్లు విస్తరణకు నోచుకోలేదు. ఉన్న రోడ్డు మధ్యలో పెద్దపెద్ద డివైడర్లు కట్టి మరింత ఇరుకుగా మార్చారు. పార్కింగ్ స్థలాలు లేక వాహనాలను రోడ్ల మీదే నిలుపుతున్నారు. ఇందిరాచౌక్, రామారెడ్డి చౌరస్తాలను జంక్షన్లుగా అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. అతీగతీ లేదు. అప్పట్లో ప్రణాళికలు రూపొందించినా ఆచరణకు నోచుకోలేదు. ఈ మధ్య మళ్లీ నిధుల ప్రకటన వచ్చింది. ఇప్పుడైనా అవి జరుగుతాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆహ్లాదం.. అధ్వానం..

జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేయడానికి నిధులొచ్చినా కాంట్రాక్టర్లు అందినకాడికి దండుకుని మమ అనిపించారు. కొత్త పార్కుల సంగతి దేవుడెరుగు.. పట్టణంలో ఉన్న ఒక్క రాజీవ్ పార్కును పాలకులు పట్టించుకున్న పాపాన పోవ డం లేదు. పట్టణ ప్రకృతి వనాలూ అధ్వానంగా ఉన్నాయి. జిల్లాకేంద్రంలో పార్కులు లేకపోవడంతో ప్రజలు సెలవు రోజుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



విస్తరణకు నోచుకోక ఇరుకుగా ఉన్న సిరిసిల్ల రోడ్

నిలిచిన మార్కెట్ నిర్మాణం..

పట్టణంలోని గాంధీగంజ్‌లో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలేశారు. డెయిలీ మార్కెట్‌లో దళారులు అడ్డా వేయడంతో రైతులు రోడ్ల మీద కూరగాయలు అమ్ముకోవాల్సి వస్తోంది. అయితే రైతులకు సౌకర్యాలు కల్పించని మున్సిపాలిటీ అధికారులు.. రైతుల నుంచి ముక్కుపిండి మరీ తైబజార్ వసూలు చేస్తుండడం గమనార్హం.

శనివారం జిల్లాకేంద్రంలో పర్యటించనున్న మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పట్టణంలోని సమస్యలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న గంప గోవర్ధన్

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించే మంత్రి కేటీఆర్ సభ ఏర్పాట్లను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శుక్రవారం పరిశీలించారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్‌తో మాట్లాడి ఏర్పాట్ల గురించి తెలుసుకున్నారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు.

మంత్రుల పర్యటన ఇలా..

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి శనివారం కామారెడ్డిలో పర్యటిస్తారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. మంత్రులు మధ్యాహ్నం 12 గంటలకు పట్టణానికి చేరుకుంటారన్నారు. పట్టణంలో మినీ స్టేడియం నిర్మాణంకోసం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. 12.30 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మైదానంలో జరిగే సభలో పాల్గొంటారన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు.

కామారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల(అటానమస్) ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బేగంపేట మహిళా కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న విజయ్‌కుమార్ ప్రమోషన్‌పై కామారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్‌గా వచ్చారు. ఇక్కడ రెండేళ్లపాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన కిష్టయ్యనుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మధ్యాహ్నం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణ, ఎం.చంద్రకాంత్, ఈ.రాజ్‌కుమార్, కే.గణేష్, అకడమిక్ కోఆర్డినేటర్ వి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధికి కృషి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



జక్కల్‌దాని తండాలో అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడరూరల్: నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని జక్కల్‌దాని తండాలో ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమాన్ని ప్రారంభించి, వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతి తండాలో జగదాంబ, సేవాలాల్ మందిరాల నిర్మాణం కోసం నిధులు విడుదల చేశానన్నారు. నియోజకవర్గంలో ఉన్న సుమారు 69పెద్ద తండాలకు అభివృద్ధిలో ప్రాధాన్యం ఇచ్చామన్నారు. తండాలో రూ.25లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, రూ.20లక్షలతో నిర్మించిన జగదాంబ, సేవాలాల్ మందిరాల ప్రహరీ, ప్లాట్‌ఫారాన్ని ప్రారంభించారు. అంతకు ముందు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తండాలోని ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహారం కార్యక్రమాన్ని ఎంఈవో నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. దసరా తర్వాత అన్ని పాఠశాలల్లో పథకం ప్రారంభం అవుతుందన్నారు. సర్పంచ్ సంగ్యానాయక్, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, సొసైటీ చైర్మన్ ఎర్వాల క్రిష్ణారెడ్డి, మోహన్‌నాయక్, కమటాల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మంచితనానికి కులమతాలు లేవు



మున్నూరుకాపు ఆత్మీయ సమ్మేళనంలో స్పీకర్‌కు నాగలి బహూకరిస్తున్న నాయకులు

బాన్సువాడ: మంచి చేయాలనే తపన ఉండాలే కానీ కులం, మతం అవసరముండదని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి స్పీకర్ హాజరై మాట్లాడారు. మున్నూరు కాపు అంటే వ్యవసాయానికి పెట్టిన పేరు అన్నారు. నియోజకవర్గంలో మున్నూరు కాపులకు రాజకీయంలో సముచిత న్యాయం చేశామని చెప్పారు. ధాన్యం ఉత్పత్తితో దేశంలోనే బాన్సువాడ నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల ద్వారా సాగు నీరందిస్తున్నామని తెలిపారు. మున్నూరు కాపు భవనానికి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు స్పీకర్ ఇంటి నుంచి మున్నూరుకాపు కులస్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షులు పత్తి శ్రీకాంత్, మంద సంగమేశ్వర్, వనం గంగాధర్, నారోజి గంగారం, పత్తి రాము, లక్ష్మణ్, బోనాల సుభాష్, బోనాల సాయిలు, పురం వెంకటి, విరేశం, ఏఎంసీ చైర్మన్ నర్సింలు ఉన్నారు.

ఆశావర్కర్ల కలెక్టరేట్ ముట్టడి



కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న ఆశా కార్యకర్తలు

కామారెడ్డి టౌన్: ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించకుంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. కొత్తబస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం వైద్యశాఖ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ శిరిషకు వినతిపత్రం అందజేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నర్సింలు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరా, రాజశ్రీ, మమత, పద్మ, పల్లవి, భాగ్య, లావణ్య, చంద్రిక, సుధారాణి, గంగమణి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్యాథ్ ల్యాబ్

- రూ. 6.46 కోట్లతో ఏర్పాటు
- ప్రారంభం కానున్న హృద్రోగ వ్యాధి సేవలు

నిజామాబాద్ నాగారం : జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో మరిన్ని వైద్యసేవలను పెంచుతున్నట్లు ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో ఆయన క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రూ. 6.46 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాథ్ ల్యాబ్‌లో గుండె సంబంధిత చికిత్సను రోగులకు అందిస్తారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అంటే ఆందోళన చెందకుండా స్నేహపూర్వక వాతావరణంలో చికిత్సలు జరుగుతాయన్నారు. జీజీహెచ్‌లో వైద్యులు అరుదైన ఆపరేషన్లు చేస్తూ, అరుదైన వ్యాధులకు చికిత్సని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్ ఖాన్, నుడా డైరెక్టర్ మల్లేశ్ గుప్తా, కార్పొరేటర్లు బబ్లు ఖాన్, షకీల్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డిప్యూటీ సూపరింటెండెంట్ బాలరాజు, డీఎంహెచ్‌వో సుదర్శనం, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా, నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: పట్టణంలోని బేతాళస్వామి ఆలయ ప్రాంతంలో చోరీకి పాల్పడిన ఇద్దరి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడ పీఎస్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఈ నెల 3న పాత బాన్సువాడలోని బేతాళస్వామి ఆలయ ప్రాంతంలో బోడ ప్రమోద్ రెడ్డి, విక్రమ్‌రెడ్డిల ఇంట్లో రూ. 4 లక్షల నగదును దుండగులు దొంగిలించారు. విచారణలో ఇంట్లో పనిచేసే బుళబోయిన గంగామణి, సాయిలు నగదు దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును త్వరగా ఛేదించిన సిబ్బందికి ఎస్పీ రివార్డు అందజేసి అభినందించారు. సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఏఎస్సై రాములు, సిబ్బంది ఉన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

నవీపేట: మండలంలోని మద్దెపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి వ చ్చిన ఎమ్మెల్యే షకీల్ కారును అడ్డుకునే ప్రయ త్నం చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈనెల 5న మద్దేపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి తిరుగు ప్రయాణంలో మద్దేపల్లి తండావాసులు ఎమ్మెల్యే కారును తండాకు చెందిన మారుతి, సేవాలాల్, ఆమ్రు, సునీతాబాయి, సంగుబాయి, లక్ష్మిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్: జిల్లా సమాచారశాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్, పబ్లి సిటీ అసిస్టెంట్ పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రా జీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం తెలిపారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియామకాలు చేస్తామని, నేటి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు పద్మశ్రీ, డీపీఆర్వో 86882 61262, మాజీద్ 99493 51684 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణకు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. 30 రోజుల శిక్షణలో ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందని అన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన గ్రామీణ మహిళలు 19 నుంచి 45 సంవత్సరాలు కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, పదోతరగతి ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో వచ్చి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08461-295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని మోపాల్ జడ్పీ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా రగ్బీ అండర్-19 ఎంపిక పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు పీడీ అబ్బయ్య శుక్రవారం తెలిపారు. డీఐఈవో రఘురాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాధర్ ఆధ్వర్యంలో పోటీలు ఉంటాయన్నారు. స్టేట్ మీట్ టోర్నమెంట్ మహబూబాబాద్‌లో ఈ నెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు లీగల్ సర్వీస్ మాడ్యుల్ క్యాంప్

ఖలీల్‌వాడి: నగరంలోని నూతన కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో లీగల్ సర్వీస్ మాడ్యుల్ క్యాంప్‌ను శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి సునీత కుంచాల శుక్రవారం తెలిపారు. ఈ సమావేశం హైదరాబాద్, నిజామాబాద్ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి అతిథులుగా సామ్ కొస్సి, హైకోర్టు జడ్జి సుమలత, తెలంగాణ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్, సీపీ హాజరుకానున్నట్లు వెల్లడించారు.

యువకుడి అదృశ్యం

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుజ్జుల్ తండాలో బానోత్ గణేశ్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ శుక్రవారం తెలిపారు. గత నెల 27న ఇంటి నుంచి వెళ్లిన గణేశ్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్లుప్తంగా

తెలంగాణ పీపుల్స్ జేఏసీ కార్యవర్గం ఏర్పాటు

కామారెడ్డి టౌన్: తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కామారెడ్డి జిల్లా నూతన కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశారు. రాష్ట్ర నాయకులు వేణుగోపాల్, రమణ నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా కన్వీనర్‌గా జి జగన్నాథం, కో- కన్వీనర్‌గా వీఎల్ నర్సింహారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎం వెంకట్రాంరెడ్డి, ఎస్ చందు, ఎం రామాగౌడ్, పి అంజయ్య, వై వెంకట్రాంరెడ్డి, వి సంతోష్ కుమార్, ఎస్ సంజీవరావును ఎంపిక చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన నేపథ్యంలో ప్రజల గొంతుకగా ఈ కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'తెలంగాణ ప్రజల ఆకాంక్షలు- పౌర సమాజ కర్తవ్యం' అనే అంశం పై సమావేశం ఉంటుందని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాగయ్య

కామారెడ్డిఅర్బన్: మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జిల్లా మాజీ అధ్యక్షుడు ఆర్ బాగయ్యను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తు జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బిఎస్ రమేష్‌కుమార్ మాదిగ ఉత్తర్వులు ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో ఎంఆర్‌పిఎస్ కార్యకలపాలు విస్తృతం చేయాలని ఆదేశించారని బాగయ్య పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల నిర్బంధం



మద్నూర్: మంత్రి హరీశ్‌రావు కార్యక్రమాన్ని అడ్డుకుంటారనే ఉద్దేశంతో శుక్రవారం మద్నూర్ పోలీసులు బీజేపీ నాయకులను నిర్బంధించారు. నాయకులు ఉన్న గదికి బేడీలతో తాళం వేశారు. మద్నూర్, బిచ్కుందకు చెందిన బీజేపీ నాయకులు హన్మండ్లు, తుకారం, విష్ణు తదితరులు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేస్తారని మండల కేంద్రంలో గల ఓ కోళ్ల ఫారంలో ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగానే వారు లోపలి నుంచి గడియ పెట్టుకున్నారు. మంత్రి కార్యక్రమాన్ని అడ్డుకోకుండా ఉండాలని పోలీసు సిబ్బంది వారు ఉన్న కోళ్లఫాం గదికి బేడీలతో బయట నుంచి తాళం వేశారు. అనంతరం శుక్రవారం మధ్యాహ్నం వదలి పెట్టారు.

సీఐ ప్రోత్సాహంతో ఉద్యోగానికి ఎంపిక

భిక్కనూరు: ఓ సీఐ కృషితో భిక్కనూరుకు చెందిన నలుగురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగం సాధించారు. భిక్కనూరుకు చెందిన గడ్డం మల్లేశ్ హైదరాబాద్‌లో సీసీఎస్ సీఐగా పని చేస్తున్నారు. గ్రామంలోని యువత ఉద్యోగం సాధించడం కోసం మల్లేశ్ స్థానిక ఉన్నత పాఠశాల మైదానాన్ని తన సొంత డబ్బుతో చదును చేయించారు. అభ్యర్థులకు అవసరమైన క్రీడా సామగ్రిని ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి వారం భిక్కనూరుకు వచ్చి అభ్యర్థులకు శిక్షణ ఇచ్చారు. దీంతో మండల కేంద్రానికి చెందిన హరీశ్, రంజిత్, ప్రశాంత్, అభిలాష్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉద్యోగం సాధించారు. సీఐ ప్రోత్సాహంతోనే తాము ఉద్యోగాలు సాధించినట్లు వారు 'సాక్షి'తో చెప్పారు.

సేంద్రియ పద్ధతులు పాటించాలి



మోర్తాడ్: పసుపు పంట సాగులో సేంద్రియ పద్ధతులను పాటించాలని స్పైసిస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్ సూచించారు. మండలంలోని వడ్యాట్‌లో పసుపు పంటను శుక్రవారం పరిశీలించారు. రసాయనాల వాడకంతో నాణ్యత దెబ్బ తింటుందని అన్నారు. నాణ్యమైన పసుపుకు జీవ ఎరువులు, జీవ రసాయనాలు వినియోగిస్తే బాగుంటుందని చెప్పారు. శాస్త్రవేత్త మహేందర్, ఐసీఐసీఐ ఫౌండేషన్ ప్రతినిధులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే నియోజకవర్గ ప్రగతి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



భక్తమార్కండేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గోవర్ధన్

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్‌తోనే కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమైందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. సిరిసిల్ల రోడ్‌లో రూ.25లక్షలతో చేపడుతున్న పట్టణ పద్మశాలీ సంఘం, భక్త మార్కండేయ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేస్తున్నాట్లు తెలిపారు. ఎవరెస్ట్ అధిరోహించిన మాలవత్ పూర్ణకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దిన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, ఏఎంసీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవి, నాయకులు జూకంటి ప్రభాకర్, గోపిగౌడ్, బల్వంత్‌రావు తదితరులున్నారు.

నియోజకవర్గానికి రూ.18.40కోట్ల నిధులు

కామారెడ్డి నియోజవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.18.40కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. పట్టణంలో సీసీ రోడ్లు, సీసీ డ్రైయిన్స్‌కు రూ.3కోట్లు, భిక్కనూర్‌కు రూ. 2.05కోట్లు, కామారెడ్డి మండలానికి రూ. 40లక్షలు, దోమకొండకు రూ.1.35కోట్లు, బీబీపేటకు రూ.95లక్షలు, రామారెడ్డికి రూ.25లక్షలు, రాజంపేటకు రూ.10లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. మెడికల్ కాలేజీ వెనకాల ఉన్న దేవునిపల్లి పీహెచ్‌సీ భవనం డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో క్యాసంపల్లి ఆర్టీఏ కార్యాలయం వద్ద పీహెచ్‌సీ నూతన భవనం నిర్మాణం కోసం రూ. 2.20కోట్లు మంజూరు అయ్యాయని వెల్లడించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఆంజనేయులు, ఏఎంసీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంబాల రవియాదవ్, ప్రభాకర్‌రెడ్డి, బల్వంత్‌రావు తదితరులున్నారు.

పేదల సంక్షేమం కోసమే కేసీఆర్ తపన



కామారెడ్డి టౌన్: సీఎం కేసీఆర్ నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తూ ఆలోచనలు చేస్తుంటారని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహార పథకాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థుల కోసం వండిన పదార్థాలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజిబుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇందుప్రియ, ఎంపీపీ ఆంజనేయులు, డీఈవో రాజు, ఏఎంసీ చైర్మన్ వెంకటి పాల్గొన్నారు.

గురుకులాలకు సీఎం పెద్దపీట



గొల్లపల్లిలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేందర్

ఎల్లారెడ్డి: సీఎం కేసీఆర్ గురుకులాలకు పెద్దపీట వేస్తున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో రూ.5 కోట్లతో నిర్మించనున్న డార్మెంటరీ భవనం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను సీఎం కేసీఆర్ ప్రారంభించారని అన్నారు. గతంలో హాస్టల్‌లో నీళ్ల చారు, పురుగుల అన్నం పెట్టే వారని, నేడు సన్న బియ్యంతో కూడిన భోజనం పెడుతున్నారని అన్నారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ ఉషాగౌడ్, పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక తదితరులున్నారు.

రామారెడ్డి: బీఆర్‌ఎస్ అధికారంలో ఉంటేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే సురేందర్ అన్నారు. శుక్రవారం రామారెడ్డితో పాటు, ఇసన్నపల్లి, పోసానిపేట్, గొల్లపల్లి, రంగంపేట, కన్నాపూర్, గోకుల్‌తండా ఉప్పల్‌వాయి గ్రామాల్లో గతంలో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. గొల్లపల్లిలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయ అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్, ఇన్‌చార్జి ఎంపీడీవో సవితారెడ్డి, వైస్‌ఎంపీపీ రవీందరావు, సర్పంచులు సంజీవ్, లావణ్య, శ్యామాగౌడ్, రాజనర్సు, నాయకులు రవీందర్‌గౌడ్, మర్కంటి బుచ్చయ్య, సతీష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

ఖలీల్‌వాడి: వ్యభిచార గృహంపై పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్ట్ చేయగా ఐదుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని దుబ్బ ప్రాంతంలో కొన్ని రోజులుగా వ్యభిచారం నిర్వహిస్తున్న కేంద్రంపై సీపీ ఆదేశాల మేరకు సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయగా మహిళలను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిమిత్తం సఖీ కేంద్రానికి తరలించారు. వ్యభిచార నిర్వాహకురాలు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

దాడిలో పోలీసులు రూ.16,100 నగదు, 7 సెల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ఎక్కడైనా వ్యభిచారం, పేకాట, గంజాయి లాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో రెండో టౌన్ ఎస్సై అశోక్, సిబ్బంది ఉన్నారు.

అటెండెన్స్ రిజిస్టర్ మాయం

నిజామాబాద్‌అర్బన్: డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్ మాయమైంది. ఈ విషయమై హెచ్ఎం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. పాఠశాలలో 309 మంది విద్యార్థులు ఉండగా, తొమ్మిది మంది టీచర్లు బోధిస్తున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగి ఒకరు విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నెల 3న పాఠశాలలో టీచర్లు సాయంత్రం వేళ రిజిస్టర్‌లో సంతకం చేశారు. మరుసటి రిజిస్టర్ మాయమవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇద్దరు టీచర్లను రిలీవ్ చేయడం లేదనే కారణం లేదా రిజిస్టర్‌లో సంతకం చేయని ఓ టీచర్‌తో హెచ్ఎం సంతకం చేయించడం కారణంగానే రిజిస్టర్‌ను మాయం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై విచారణ చేయించాలని డీఈవోకు హెచ్ఎం విన్నవించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



రాములు (ఫైల్)

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో అప్పుల బాధతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన అల్లం రాములు (35) ఉపాధి నిమిత్తం దుబాయికి మూడేళ్ల క్రితం వెళ్లి వచ్చాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక శుక్రవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి



లింగయ్య (ఫైల్)

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల శివారులోని ధర్మారావ్‌పేట్-అమర్లబండకు వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. అమర్లబండ గ్రామానికి చెందిన ఎర్రొల్ల లింగయ్య(70) సదాశివనగర్ నుంచి స్వగ్రామానికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా కామారెడ్డి వైపునకు వస్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొన్నది. దీంతో వెనుక టైర్ల కింద పడ్డ లింగయ్య తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన డ్రైవర్ పారిపోయి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీ ఎత్తుల ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే ఫోన్‌లో హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని మరొకరు..



ఖలీల్‌వాడి: నగరంలోని అర్సపల్లి రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతి చెందినట్లు రైల్వే ఇన్‌చార్జి ఎస్సై తావూనాయక్ తెలిపారు. మృతుడి వయస్సు 25 సంవత్సరాలు ఉంటుందని అన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712658591, 8712568511 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి



సత్యంరెడ్డి (ఫైల్)

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సత్యంరెడ్డి (75) శుక్రవారం అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సత్యంరెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య శోభాంజలి, ఇద్దరూ కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. హైదరాబాద్‌లో శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

బోరు మోటార్‌ను బయటకు తీస్తుండగా..

మోర్తాడ్(బాల్కొండ): మండలంలోని సుంకెట్‌లో కూలీ పని చేసే ఆకుల బాలకిషన్(37) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఏఎస్సై గోపాల్ తెలిపారు. రామన్నపేట్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం బోరు మోటారును బయటకు తీస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాలకిషన్ అంత్యక్రియల్లో కాంగ్రెస్ నాయకుడు సునీల్‌రెడ్డి పాల్గొని బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



భూమన్న మృతదేహం

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీలో డొంకేశ్వర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన రెడ్డి భూమన్న(53) అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ శుక్రవారం తెలిపారు. రెడ్డి భూమన్న వృత్తిరీత్యా కూలి పని చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం ఉమ్మడి గ్రామానికి వెళ్తున్నాని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం ఎన్టీఆర్ నగర్ కాలనీలోని చర్చి వద్ద మృతిచెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా విచారణలో భూమన్న మృతదేహంగా తేలింది. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.